ఆమె
లేకపోయినా
అతని
కోర్కెలు
తీరాయి
మరి
ఆమె సంగతి?

ఇంద్రగంటి జానకీబాల కథ

# కోర్కెల సమాధి

రామకోటి ఇంటిముందు వరండాలో వైరు కుర్చీలో విశ్రాంతిగా కూర్చున్నాడు. తెల్లారగట్ల మొదలైన వర్షం అప్పుడే తెరిపిచ్చింది. సూర్యుడు దూసుకొస్తూ నీళ్ళోడుతున్న చెట్లని వెచ్చగా నిమురుతున్నాడు. రామకోటి ఏమాలోచిస్తున్నాడో చెప్పడం కష్టంగానీ ఆకాశంకేసి రెప్పవేయకుండా చూస్తూ నిశ్చలంగా కూర్చుని మాత్రం ఉన్నాడు.

నాగమణి పొగలు కక్కే కాఫీగ్లాసు పట్టుకొచ్చి భర్త చేతికిస్తూ "జాగ్రత్త. వేడిగా ఉంది" అంది. అతను జాగ్రత్తగా అందుకున్నాడు.

ఆమె అక్కడే అతని కాళ్ళదగ్గరగా కూర్చుని నెమ్మదిగా మొదలుపెట్టింది..

"కాఫీతాగి, కాస్త త్వరగా తెమలండి. నెత్తిమీద నూనె పెట్టి తలంటుతాను. ఈ రోజు మీపుట్టిన రోజు కదా" అంది.

రామకోటి వైరాగ్య ధోరణిలో అన్నాదు.


"ఇప్పుడవన్నీ ఎందుకు నాగూ, నేనేమన్నా చిన్నవాడినా.." అని —

"అలా అనకండి. నా ముచ్చట కాదనకండి. మీకు చెప్పకుండా నిన్న ఎగ్జిబిషన్‌లో లక్నో లాల్చీ, గ్లాస్కో పంచె కొన్నాను" అంది తలొంచుకుని.

రామకోటి ఒక్కసారి బరువుగా నిట్టూర్చి—

"ఏమిటో పిచ్చిదానవు. మనమేమైనా చిన్నవాళ్ళమా ఇంకా అచ్చట్లూ ముచ్చట్లూ అంటూ అనుకోవడానికి" అన్నాడు.

"మీరింక మాట్లాడకండి" అంది నాగమణి. ముప్ఫయి అయిదేళ్ళ ఆమె కళ్ళల్లో



వజ్రపుపొడి లాంటి మెరుపు
తళుక్కుమంది.

దొడ్లో రజని చేతిలోని కాఫీ కప్పు
విసురుగా గోడకేసి కొట్టింది. కప్పు పగిలి
పెంకులు పెళపెళరాలాయి.

''ఏమిటదీ'' అన్నాడు సందేహంగా
రామకోటి గొంతులో ఒక రకమైన
నీరసంతో —

నాగమణి పరుగులాంటి నడకతో పెరట్లోకి వచ్చింది చిరచిరలాడుతున్న కూతుర్నిచూసి —

"ఏమైందే?" అంది.

రజని ఏమీ మాట్లాడలేదు. అసహ్యాన్ని నింపుకున్న ఆమె చూపులకే శక్తి ఉంటే ఆ తల్లి బుగ్గి బూడిదైపోయి ఉండేది.

నాగమణి తలొంచుకుంది.

"ఏమైందా? నీలాంటి సిగ్గులేని తల్లికి నేను కూతురుగా పుట్టినందుకు కష్టబద్దలైంది. తెలిసిందా" అంటూ విసురుగా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

* * *

ఇరవై మూడేళ్ళ రామకోటికి అందమైన పందొమ్మిదేళ్ళ నాగమణితో పెళ్ళయింది. పెళ్ళికి ముందు రెండుమూడుసార్లు రామకోటి నాగమణి అన్నయ్యలతో వాళ్ళింటికి రావడం జరిగింది. చెంపకి చారెడు మెరిసే కళ్ళతో బారెడు పొడవైన జడతో, తెల్లగా దంతపు బొమ్మలా వుండే నాగమణిని చూసి రామకోటికి మనసు చలించిన మాట నిజం. కులమూ, గోత్రమూ, అంతస్థూ పెద్దగా తేడా లేకపోవడంతో పెళ్ళి కుదరడంలో పెద్ద ఇబ్బంది ఏమీలేకపోయింది. అయితే రామకోటి కొంత తన పెద్దవాళ్ళతో పంతమాడి లాంఛనాలు, అలకలు లాంటివి ఖండించాడు. దానికి పూర్తిగా తనది ప్రేమవివాహమని స్నేహితుల్లో ప్రచారం చేశాడు. ఆ మాట తెలిసి నాగమణి అన్నలు ఆశ్చర్యపోయినా పెళ్ళి జరిగిపోతోంది కదాని ఊరుకున్నారు. అయినా ఆఖరి అన్నయ్య శేఖరం మాత్రం విపరీతంగా చిరాకుపడ్డాడు.

'ప్రేమా లేదు, దోమా లేదు. ఇలాంటి వానుముచ్చు కబుర్లు నాకు నచ్చవు. వీడ్ని ప్రేమించడానికి మన చెల్లెల్ని బలాదూరు వదిలామంటాడా' అంటూ లేచాడు.

ఇంటి అల్లుడితో తగవు ఇంతింత కాదని మిగిలిన అన్నలు శేఖరం నోరునొక్కారు.

హైస్కూలు టీచరుగా పనిచేస్తున్న రామకోటి కంటే చాలా విషయాల్లో నాగమణి తెలివైంది. చురుకైంది. పైగా ఆమెకి భర్తమీద వల్లమాలిన ప్రేమ, ఆరాధన. అతనిని చూసుకుని మురిసిపోతుంది. అదొకరకమైన ఆత్మార్పణ లాంటిది ఆమె అనుక్షణం అనుభవించేంది అతని ముందు తనెప్పుడూ ఓడిపోవడానికి పక్కకి తొలగిపోవడానికి సంసిద్ధురాలై ఉంటుంది. ఆడబడుచుకి చీరకొంటే, అది చూసి ఆడబడుచు—

"చీర బాగుంది వదినా" అంటే—

"మీ అన్నయ్య ఎంపిక చేశారు" అనేస్తుంది వెంటనే. అందులో ఏదో తెలియని ఆనందం ఆమె అనుభవిస్తుంది. అత్తమామల్ని ఎంతో అభిమానిస్తుంది. భర్త ముఖంలో చిన్న ప్రసన్నత కనిపిస్తే అదే ఆమెకి కొండెక్కినంత ఆనందం కలిగించేది.

అయితే క్రమంగా రామకోటిలో తనూహించినంత చిత్త సంస్కారం, గొప్పతనం తనమీద ప్రేమా కూడా లేవని ఎందుకో నాగమణికి అనిపిస్తూ ఉండేది.


అదో పల్చగా కమ్మిన మంచుపొగలా మనసుని కమ్మేసినా ఎప్పుడూ ఎవ్వరితోనూ అనకపోవడమే కాకుండా తనకి తానుకూడా విశ్లేషించుకోలేదు. అలాంటి భావన ఎప్పుడొచ్చినా తుడిచిపెట్టెయ్యడానికి ప్రయత్నం చేసేది.

నాగమణికి నెలతప్పినప్పటినుంచి రామకోటికి ఆమె మీద మోజుకూడా తప్పిందని స్పష్టమైంది. దానికి తగ్గట్టుగా ఆమె విపరీతమైన వేవిళ్ళతో బాధపడి, తిన్నదేమీ లోపల ఇమడక పుల్లలా తయారైంది. అప్పుడు కూడా భర్తనుంచి ఒక చల్లని మాట, ప్రేమతో చూపు ఆమె ఎరుగదు. ఎప్పుడూ ఇంటికొచ్చి విసుగ్గా అటూ ఇటూ తిరుగుతూ, నానా హంగామా చేసి, ఇల్లంతా అశాంతిపాలుచేసి ఇంట్లో ఉన్న ఇతరులకి పరోక్షంగా అవమానాన్ని కలిగించి మళ్ళీ జోళ్ళు వేసుకుని బయటకెళ్ళిపోయేవాడు. పదిరోజులు తల్లిగారింటికి వెళ్ళినా నాగమణి స్థిమితంగా ఉండేదికాదు. రామకోటి మీద బెంగగా అనిపించి వచ్చేసేది.

'మనం ఎవరి కోసమైతే ఎదురుచూస్తామో వాళ్ళు మరెవరికోసమో ఎదురుచూస్తారు' అన్నట్లు — నాగమణి రామకోటి కోసం ఎంత పరితపించినా రామకోటి దృష్టి ఎటో ఉండేది.

అర్భకంగా ఉండటంవల్ల, ఆనందంగా ఉండలేకపోవడంవల్ల, నాగమణి ఆరోగ్యం దెబ్బతింది. కాన్పు కష్టమైంది. డాక్టరు జాగ్రత్తలు చెప్పి పురుటి తర్వాత ఓ ఆరు నెలలు విశ్రాంతిగా ఉంచండి అమ్మాయిని అని చెప్పారు. ఆడపిల్ల పుట్టిందని నిరాశాలేదు. ఆనందమూలేదు. రామకోటి దృష్టి ఆఘాల మేఘాలమీద ఉండేది.

నెలలోపునే భర్త దగ్గరికి బయలుదేరిన కూతురికి నచ్చచెప్పలేక తల్లి సతమతమైంది. చంటిపిల్లతో చేసుకోలేకపోతే మళ్ళీ ఆరోగ్యం మొదటికొస్తుందేమోనని భయం ఆమెని వణికించేసింది. అల్లుడు కూతుర్ని చాకిరీ



కోసం తప్ప మరోమంచి మాటలేదని లోపల్లోపల గ్రహించిన తల్లి సంసారం పెద్ద కోడలిమీద అప్పగించి కూతురితో బయలుదేరింది.

రామకోటి రోజూ రాత్రి పదింటికి వచ్చేవాడు. సాయంత్రం అయిదింటికి స్కూలు వదిలితే అంతసేపు ఎక్కడ తిరుగుతాడో ఏం చేస్తాడో అని అత్తగారు లోపల అనుకున్నా పైకి పెదవి కదిపేది కాదు. కూతురి ముందు ఏం మాట్లాడలన్నా భయపడేది. నాగమణి తన భర్తగురించి ఎవర్నీ నోరెత్తనిచ్చేదికాదు. తన మనసులో ఎంత బాధవున్నా తనే మింగేసింది.

* * *

ఒకరోజు సాయంత్రం బరువైన వార్త ఒకటి మోసుకొచ్చాడు శేఖరం. అతని మాటలు వింటూనే నాగమణి కుప్పకూలిపోయింది. ఎన్ని నాళ్ళగానో కరుడుకట్టుకుపోయిన దుఃఖం కాల్వలు కట్టేంది.

ముప్ఫయ్యేళ్ళ ముండమోసిన ఒక మదపిచ్చిది రామకోటిని తగులుకుంది. అదే ఇతన్ని పట్టిందో, ఇతనే వలపన్నాడో — దానికీమధ్య మదపిచ్చిపట్టి వెర్రికేకలు పెట్టి కనిపించిన మగాళ్ళనందర్నీ నా తాపం తీర్చరో అంటూ ఊరూవాడా యాగం చేసింది. అలాంటిది రామకోటి దృష్టిలో పడటానికి కారణం తెలియలేదు. అయితే నెమ్మదిమీద తెలిసిందేమంటే అతని జాతకంలో ముదనష్టపు డబ్బు బాగా వస్తుందని చెప్పారట. అందుకే దాన్ని తగులుకున్నాడు. పెళ్ళాం ముఖం చూడటం మానేశాడు. నిజానికి అలా పిచ్చిపట్టిన ఆడదాన్ని కామదాహం తీర్చడానికి వెళ్ళడానికి మగాడికి చాలా ధయిర్యం వుండాలి. అది రామకోటికి ఎలా కలిగిందో ఎవ్వరూ ఊహించలేరు —

అదీ శేఖరం చెప్పిన వృత్తాంతం. అప్పుడు నాగమణి భర్త ఇన్నాళ్ళ ప్రవర్తనని విశ్లేషించుకుంది.

రోజూ స్కూలునుంచి అటేపోయి, అచ్చట్లుముచ్చట్లూ అయ్యాక, రాత్రి పదింటికి భోజనం చేసో చేయకో ఇంటికొచ్చి గురక పెట్టి నిద్రపోయేవాడు.

భార్యతో ప్రేమగా మాట్లాడటంగానీ ఆరోగ్యం గురించి అడగడంగానీ, పిల్లని సముదాయించడంగానీ ఏమీ ఉండేదికాదు

అంతా అన్వయించుకున్నాక నాగమణి గుండెల్లో తాటాకులు వేసి అగ్గిపుల్ల గీసినట్లయింది. ఆ తల్లి ప్రాణమైతే విలవిల్లాడిపోయింది.

నలుగురన్నలూ కూడబలుక్కుని బావగార్ని అడగడానికి బయలుదేరారు. నెమ్మదిగా చెప్పారు. బతిమాలారు. తమ చెల్లెలి జీవితం బుగ్గిపాలు చెయ్యవద్దని కాళ్ళావేళ్ళాపడి వేడుకున్నారు. రామకోటి ససేమిరా వినలేదు.

'నాకింట్లో సుఖం లేదన్నాడు. తన మాటకి విలువలేదన్నాడు — చివరికి

మీ అమ్మవచ్చి ఆర్నెల్లు ఇక్కడ

తిష్ఠవేసింది. మొగుడూ పెళ్ళాలమన్న ధ్యాసే లేదు. మా ఇద్దరికీ ఏకాంతం ఎక్కడుందీ? ఉప్పూకారం తింటున్న వాడికి ఆడది కావాలని ఉండదా? తప్పా? మీ రంతా నెత్తికెక్కికూర్చుంటే నా ఇష్టమైనట్టు నేను తిరుగుతాను'' అన్నాడు అరుస్తూ, చేతులూ తిప్పుకుంటూ.

ఈ మాటలకి అన్నలు ముగ్గురూ, నాగమణి, తల్లీ అంతా అవాక్కయిపోయారు. నిజానికా ముసలి ప్రాణం ఎందుకొచ్చి ఉంది? భార్య ఆరోగ్యం బాగుపడటానికి కదూ! ఇంటెడు చాకిరీ చేసి అల్లుడికన్నీ అమర్చేది. వంటిదాన్ని సాకేది. కూతురు పది కాలాలపాటు పచ్చగా ఉండాలని కదూ ఆ తల్లి తనది కానిచోట ఒదిగి ఉన్నది? కాని తామొకటి తలిస్తే — అల్లుడొక విధంగా అర్థంచేసుకొని కూతురి జీవితంలో నిప్పులు పొయ్యడం — ఆ అభాండానికి సిగ్గుతో కుంచించుకుపోయారు.

నిజానికది అతను తను చేస్తున్న తప్పును కప్పిపుచ్చుకోటానికి చెప్పిన కుంటిసాకు అని అందరూ అంతరాంతరాలలో గ్రహించినా, అతని దుర్బుద్ధికి కుమిలిపోయారు. శేఖరం కసితో ఊగిపోయాడు అయినా పైకి శాంతంగా —

"బావగారూ! మీకంతగా ఏకాంతం దొరకటం లేదనిపిస్తే మీ ఇద్దరూ కలిసి ఓ పదిరోజులు ఎక్కడికైనా వెళ్ళవచ్చు. హాయిగా ఏ హోటల్లోనో వుండవచ్చు. మీరా మాట చెప్తే పిల్లనికూడా అమ్మ చూసుకుంటుంది'' అన్నాడు.

ఆ మాటకి రామకోటి సర్రునలేచాడు.

"హోటళ్ళలో వుండటానికి కాదు పెళ్ళిచేసుకున్నది'' అన్నాడు రంకెవేస్తూ. శేఖరం రక్తం ఉడుకెత్తిపోయింది.

"మరే! మదపిచ్చి ముండని మరగడానికి చేసుకున్నారు పెళ్ళి'' అన్నాడు ఉద్రేకంగా. అతనన్న మాట అక్షరాల నిజమైనా అది నోరు జారడమే అయింది. రామకోటి కోపంతో ఊగిపోయాడు. బావమరిదితో కలబడ్డాడు. పెద్ద రాద్ధాంతం రగడయింది. మిగిలిన అన్నలు శేఖరంని వెనక్కి లాగేశారు. కేకలేశారు. ఆనాటినుండి శేఖరం మళ్ళీ బావగారి ముఖం చూడలేదు. వాళ్ళ గుమ్మం తొక్కలేదు.

## సర్టిఫికెట్



"ఐయామ్‌సారీ మిస్టర్ రామారావ్ ఎంత ప్రయత్నించినా మీ నాన్నగార్ని దక్కించుకోలేక పోయాం. నా పేషెంట్ పోవడం నాక్కూడా బాధే'' అన్నాడు డాక్టర్ ఆరోగ్యమూర్తి.

"మీ నాన్నగారు ఇన్స్యూరెన్స్ చేశారట. వాళ్ళు డెత్ సర్టిఫికెట్ అడుగుతున్నారు'' అడిగాడు రామారావు.

'డెత్ సర్టిఫికెట్టా? అలాగే యిస్తాను''

"అహహ మీరు ట్రీట్‌మెంట్ చేసినట్లు యిస్తే చాలట'' తాపీగా అన్నాడు రామారావు.

—ఋషిశ్రీ (కమ్మపాలెం)

బాంధవ్యాన్ని వదులుకోలేక, నిర్భాగ్యమైన నాగమణి జీవితం మీద జాలితో తామూ వదిలేస్తే ఏమైపోతుందో అనే బెంగతో మిగిలిన ఇద్దరన్నలూ అంతంతమాత్రంగా వచ్చిపోతూ ఉంటారు. అయితే గొడవ జరిగిన మర్నాడే ప్రయాణమై వెళ్ళిపోయిన ముసలి ప్రాణం మళ్ళీ ఆ ఇంటివైపు తొంగిచూడలేదు.

అయితే వచ్చికూర్చున్న పదినిముషాల్లో రజనిని లాలించి, ముద్దాడి అవీఇవీ కొనిపెట్టి ఎప్పుడైనా తీసుకెళ్ళి ఒక్కపూట ఉంచుకుపంపేసేవారు. అందుకే రజనికి మావయ్యలంటే ఎంతో ఇష్టం. చనువు ప్రేమ — పైగా ఊహ తెలిసినప్పటినుండి తల్లిబాధలు, తండ్రి ప్రవర్తన చూచాయిగా అతని వ్యవహారాలు గ్రహించడంవల్ల అతనిమీద ఆమెకి ఎనలేని అసహ్యం.

కన్నీళ్ళతో అసంతృప్తితో నాగమణి కాపురం చేస్తూనే ఉంది. చేయక ఆమె అనుసరించగల వేరే మార్గం కూడా లేదు. ఒకనాడు తల్లి మీద బెంగతో తనే చూడటానికెళ్ళింది.

"ఏదోలే నీ కడుపున ఓ మగ నలుసు పుడితే నీ కష్టాలు గట్టెక్కినట్లే" అంటున్న తల్లి మాటలకి విస్తుపోయింది నాగమణి. ముసలి వాళ్ళ చాదస్తాలు ఎంత తీవ్రస్థాయిలో ఉంటాయో ఆమె అర్థం చేసుకుంది. గుండె గుబగుబలాడి పోతుంటే కన్నీళ్ళు దిగమింగింది. అసలు విషయం తెలిసిన అన్నలు తల్లిమాటలు విని ఆమెని చూసి జాలిపడ్డారు.

అయితే రామకోటి చాలా జాగ్రత్తగా ఆపరేషన్ చేయించుకుని డాక్టర్ దగ్గర పిల్లలు పుట్టకుండా మళ్ళీ పరీక్ష కూడా చేయించుకుని వ్యవహారంలోకి దిగాడు. ఎందుకంటే ముండమోసిన దానికి కడుపొస్తే కొంప మునుగుతుందని అతనికి ముందుచూపు.

మనిషి జీవితంలో పొరబాట్లు చెయ్యడం వేరు వాటిని సరిదిద్దుకోవడం వేరు. అలాంటి మనిషికి క్షమ ఉంది. కానీ ప్రణాళికా బద్ధంగా ద్రోహం తలపెట్టిన వారికి నిష్కృతి ఉండదు. రామకోటి రెండవ కోవకి చెందిన వాడు.

ఇవన్నీ తల్చుకుని కుమిలిపోయింది నాగమణి — అయితే మనసులో ప్రేమానురాగాలు చంపు కుందామన్నా చావకపోవడం ఆమె దురదృష్టం. మనసు శరీరం ఎప్పుడో చచ్చిపోవడం అయిపోయినా జీవిస్తూ వుంది.

అతనొక్కొక్క రాత్రి భార్యదగ్గర చేరి —

"అర్భకపు ముండవు. అదైతే నాదగ్గర అయిదుసార్లు, ఆరుసార్లు పడుకుంటుంది. ఒక రాత్రి" అంటూ జుగుప్సాకరమైన, అసహ్యకరమైన సంభాషణలు జరుపుతుంటే నోరు విప్పే ధైర్యం లేక మనసూ, వళ్ళూ చచ్చిపోయి నాగమణి జీవచ్ఛవంలా బ్రతుకీడుస్తోంది.

* * *

ఆరోజు ఎవరో గుమ్మంలో నిలబడి —

"రామకోటిగారిల్లిదేనా" అంటే—

"అవునండీ" అంటూ

బయటకొచ్చింది నాగమణి.

"ఆయన్ని హాస్పిటల్లో చేర్పించారు. మిమ్మల్ని వెంటనే తీసుకురమ్మన్నారు" అంటూ అతను వివరాలు చెప్పాడు.

నాగమణి దడదడలాడిపోయింది. చేతులూ, కాళ్ళూ ఆడలేదు. ఏదోవిధంగా, భయం భయంగా బయలుదేరింది. ప్రేమగురించి ఆమెకి పెద్దగా తెలియదు. అనుభవంలేదు. ఎందుకంటే రామకోటి ఆమెని కామించాడుగానీ ప్రేమించలేదు. అయితే ఆమె అతనెన్నడూ ద్వేషించలేదు. ఉన్నపళంగా హాస్పిటికి పరుగెట్టింది. అతనికి వాతం కమ్మేస్తోంది. డాక్టర్లు వైద్యం మొదలుపెట్టారు. నలభై ఏళ్ళ ఆడదానితో ఎడతెరిపి లేకుండా జరిపిన కామక్రీడ పర్యవసానంగా డాక్టర్లు గ్రహించి వైద్యం చేశారు.

ముగ్గురన్నలూ వచ్చి అండగా నిల్చారు. కూతురి పసుపు కుంకుమ నిలబెట్టమని ముసలితల్లి వేయి దేవుళ్ళకి మొక్కుకుంది.

పదమూడేళ్ళ రజని మాత్రం శేఖరం మావయ్యదగ్గరే ఉండిపోయింది. ఎంత బతిమాలినా తండ్రిని చూడటానికి కూడా రాలేదు.

నెల్లాళ్ళ డాక్టర్ల శ్రమ, మంచినీళ్ళలా ఖర్చయిన డబ్బు, గుప్పించిన మందులు, నిద్రాహారాలు మాని నాగమణి చేసిన సేవలు — ఇవన్నీ కలిసి మళ్ళీ రామకోటికి ప్రాణం పోశాయి. అతను తెలివి వచ్చినపుడల్లా నాగమణి చెయ్యి తన చేతిలోకి తీసుకుని గట్టిగా పట్టుకుని కళ్ళు మూసుకుని పడుకునేవాడు. అందులో ప్రేమలేదు. అశక్తత ఉంది. ఆ స్పర్శ నాగమణిని వశపరచుకుంది. అతని నిస్సహాయత ఆమెకేదో భరోసా ఇస్తున్నట్లనిపించింది. మూడు నెలలకి రామకోటి మళ్ళీ మామూలు మనిషయ్యాడు.

*    *    *

నాగమణి నిశ్శబ్దంగా పడుకుని ఉంది. ఆమె కళ్ళల్లో ఊరుతున్న కన్నీళ్ళు నెమ్మదిగా చెంపలమీద జారుతున్నాయి. ఆమె దుఃఖంలో ఉద్రిక్తత లేదు. ఊరట పొందాలనే ఆరాటమూ లేదు. భరించరాని బాధని కన్నీళ్ళ రూపంలో దించుకుంటున్న నిర్లిప్తత.

పసిపిల్ల రజని మూడు పూటలనుండి పచ్చి మంచినీళ్ళు ముట్టలేదు. దగ్గరకెళ్తే



## కిక్కిరిసిన జైళ్ళు

నేరాలు ఎక్కువగా జరిగేది మన దేశంలోనే అని మనం అనుకొంటూ ఉంటాం. అది నిజంకాదు. ఈ విషయంలో అనేక దేశాలు మనముందే వున్నాయి. ఉదాహరణకు బ్రిటన్‌లో కోర్టుశిక్షలు విధించిన తర్వాత నేరస్థుల్ని జైలులో పెట్టడానికి ఏ జైలూ ఖాళీగాలేదట. అంటే బ్రిటన్‌లోని జైళ్ళు అంత కిక్కిరిసి ఉన్నాయన్నమాట.

అందువల్ల ఈ సంవత్సరం 350 మిలియన్ పౌండ్లను వెచ్చించి కొత్తగా జైళ్ళను నిర్మించడానికి బ్రిటన్ ప్రభుత్వం పథకాన్ని రూపొందించింది.

జూపిటర్

కష్టమంటోంది. ఉన్న పళంగా తను మావయ్యి దగ్గరకెళ్ళిపోతానని ఆమె మంకుపట్టు పట్టి కూర్చుంది.

నాగమణి ఎంత చెప్పినా విదిలించి పారేసింది. తండ్రి ఆ ఛాయలకొస్తేనే చీదరించుకుంటోంది. తెలిసీ తెలియని వయసూ, చిన్నతనంలోనే దెబ్బతిన్న మనస్సు ఏమడిగినా సమాధానం చెప్పదు — శేఖరం వచ్చి రజనిని తీసుకెళ్ళిపోయాడు.

నాగమణిని ఆకాశమంత విషాదం ఆవరించి ఆమెను పూర్తిగా కమ్మేసింది. నిన్నటివరకు తనని చుట్టుకుపోయి పడుకునే తన కన్నకూతురు ఈ రోజు తనని తాచుపాముని చూసినట్టు చూస్తోంది. తాను రామకోటి చేరువగా ఉన్నప్పుడు రజని కళ్ళల్లో కనిపించే చూపులు బాకులు, ఈటెలై నాగమణి గుండెల్లో గూడు కట్టేసుకున్నాయి.

నెమ్మదిగా నాగమణికి కునుకు పట్టేసింది. చల్లగా ఉందా వాతావరణం. అడవినిండా పూలు అప్పుడొక జల్లు — ఇప్పుడొక ఎండ పొడ — ఉండుండీ ఆకాశంలో హరివిల్లు.

రామకోటి చెయ్యిపట్టుకుని నాగమణి నడుస్తోంది. అప్పుడప్పుడు వయ్యారంగా తూలిపోతుంది. అతని మీదకి అతనామెని అలవోకగా పొదివి పట్టుకుంటున్నాడు. రామకోటి కొన్నచీర — తను మక్కువతో కట్టుకొన్న చీర — ధగధగ లాడిపోతోంది. మెత్తని తన చీర మించి గట్టిగా వత్తుకుంటున్న అతని చేతుల్లో కళ్ళల్లో ఆత్రుత కొంటెతనంతో కోరిక — ఒంపులు తిరిగిన మెత్తని పెదవులు అతను.. తన.. తన..

నాగమణి ఉలిక్కిపడి లేచింది. కలకరిగిపోయింది. ఎన్నినాళ్ళ కిందటి రూపాలనీ అవి మళ్ళీ ఈనాడు కళ్ళకు కట్టాయి నవయవ్వన వంతుడైన రామకోటి బిగికౌగిలి స్పర్శకి ఇప్పటికీ ఆమె శరీరం గగుర్పొడిచేవుంది. మెల్లగా — తిరుగుబాటు చేసిన తీయని కోర్కెలు తుపాకీ గుళ్ళకి నేలకొరిగిన సిపాయిల్లా జారిపోయాయి.

పక్కకి తిరిగి చూసింది. అకాల వార్థక్యం మీదపడిన రామకోటి నిద్రపోతున్నాడు. నిద్రమాత్రలు వేసుకుని గురకపెట్టి —

అతను పొద్దున్న అన్నమాటలు —, తను వెలిబుచ్చిన కోరికకు సమాధానం.

"ఏమిటీ! మనమింకా కుర్రాళ్ళ మనుకుంటున్నావా? చిటికెన వేలుపట్టుకుని ఊటీలో, కొడైకనాల్లో తిరగడానికి నా కలాంటి వేమీ లేవు. రేపు కాకాని సాంబశివుడి గుడికి వెళ్దాం — ఆ తర్వాత మంగళగిరి పానకాల స్వామిని దర్శించుకుందాం" అన్నాడు.

నాగమణి నిట్టూర్చింది. నిజం! అతని కోరికలు తీరిపోయాయి తనిలాగే మిగిలిపోయింది. తను లేకుండా అతని కోరికలు తీరిపోతాయి. అతనివల్ల కాకుండా తన కోర్కెలెలా తీరుతాయి?

సంఘం — పరువు — ప్రతిష్ఠ — పాతివ్రత్యం మొదలైన ముడిపదార్థాలు సేకరించి నాగమణి తన కోర్కెలకి సమాధి కట్టడం మొదలుపెట్టింది.